## నేడు విద్యుత్ సరఫరా బంద్

**ఉప్పల్, జూలై 13:** నవభారత్ ఫీడర్ లోని నవభారత్, చెంవెదలేన్, అశోక్‌లేలాండ్, మోడ్రన్ బేకరి, ఎన్ఆర్‌బీ ఇండస్ట్రీ, డీఎస్ఎల్, తదతర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం12గంటల వరకు, ఐడీఏ ఉప్పల్, గుబ్బా, ఫెర్రోకాస్ట్, ఈఎస్ఐ హాస్పిటల్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అదే విధంగా అజంత హోటల్ లేన్, శ్రీకృష్ణ ఫార్మ, ఎస్ఎస్ బయోటెక్, ఉప్పల్ పారిశ్రామిక ప్రాంతంలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఉప్పల్ భగాయత్ ఏఈ కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

## వైభవంగా వారాహి అమ్మవారి నవరాత్రులు

**నేరేడ్‌మెట్, జూలై 13:** శ్రీవారాహి అమ్మవారి నవరాత్రుల సందర్భంగా ఓల్డ్ అల్వాల్‌లోని శ్రీ తిరుక్కన్ మహా సింహ వరాహి అమ్మవారి ఆలయంలో వైభవంగా వారాహి అమ్మవారి నవరాత్రులు జరుగుతున్నాయని వ్యవస్థాపకులు అష్టమసిద్ధి ఉపాసకులు ప్రొఫెసర్ డా. నరేన్ చక్రవర్తి అన్నారు. శనివారం విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారాహి అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఆలయ ప్రధాన అర్చకులు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సేవకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ కోచింగ్ సెంటర్ల మాఫియాను కట్టడి చేయాలి

**కాప్రా, జూలై 13:** రాష్ట్రంలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేట్ కోచింగ్ సెంటర్లను కట్టడి చేయాలని, నిరుద్యోగులు ప్రభుత్వ స్టడీ సర్కిళ్లను వినియోగించుకోవాలని అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్,ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి.సత్యప్రసాద్ అన్నారు. ఏఐవైఎఫ్ ఉప్పల్ మండల సమావేశం ఈసీఐఎల్‌లోఓని నీలం రాజశేఖర్‌రెడ్డి భవనంలో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కోచింగ్ సెంటర్ల ఆగడాలు మితిమీరుతున్నాయనీ, అధిక మొత్తంలో ఫీజులు గుంజుతున్నారని వారు ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని, నోటిఫికేషన్ల ద్వారా ఉద్యోగాలను భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నేతలు గిరిబాబు, చంద్రశేఖర్, రవి కుమార్, స్వప్న,సంధ్యరాణి, కిరణ్, ప్రణవ్, సూర్య, భరత్ పాల్గొన్నారు.

## బాలుడు అదృశ్యం

మధుసూదన్(ఫైల్)

**పీర్జాదిగూడ, జూలై 13:** బాలుడు అదృశ్యమైన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ...వినాయకనగర్ కాలనీకి చెందిన సంజీవకుమార్ కుమారుడు మధుసూదన్ (13) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. ఈనెల 8న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో శనివారం మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## అమ్మవారికి కుంకుమార్చన

అమ్మవారికి కుంకుమార్చన చేస్తున్న వేదపండితుడు

**బోడుప్పల్,జూలై13:** బోడుప్పల్ మాతా నిమిషాంభికా అమ్మవారికి విశేషకుంకుమార్చన శనివారం ఘనంగా జరిగింది. 2వందల కిలోల కుంకుమను వేదమంత్రోచ్చరణలతో అభిషేకించారు. అనంతరం అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అధ్యాత్మికవేత్త, ప్రవచనకర్త అనంతలక్ష్మి, మహిళలు సామూహిక లలితా సహస్రనామ పారాయణం మధ్య వేదబ్రాహ్మణులు కుంకుమార్చన క్రతువు నిర్వహించారు.కార్యక్రమంలో వందల సంఖ్యలో భక్తులు, ఆలయ చైర్మన్ వినోద్‌కుమార్, అశోక్‌కుమార్, శ్రీనివాస్, రమేశ్, నిర్వాహకులు శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## భక్తులకు అన్నదానం

**కీసర, జూలై 13:** భక్తుల సౌకర్యార్థం చీర్యా ల్ శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆలయ చైర్మన్ లక్ష్మీనారాయణగౌడ్ ఆధ్వర్యంలో ఆలయంలో శనివారం భక్తులకు అన్నదానం చేశారు.కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఇందిరలక్ష్మీనారాయణ, ఆలయ ధర్మకర్త శ్రీహరిగౌడ్, భక్తులు పాల్గొన్నారు.

# వినూత్న ఆలోచనలతోనే విజయం

- మల్లారెడ్డి కాలేజీలో స్నాతకోత్సవం
- పాల్గొన్న ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

విద్యార్థులకు పట్టాలను అందజేస్తున్న ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, ప్రిన్సిపాల్ రామస్వామి రెడ్డి తదితరులు

**మేడ్చల్, జులై 13:** వినూత్న ఆలోచనా విధానం, కొత్త ప్రణాళికలు, ఆచరణ విజయానికి మూల సూత్రాలు అని ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల మెయిన్స్ క్యాంపస్‌లో శనివారం స్నాతకోత్సవం, ప్రాంగణ నియామక, పూర్వ విద్యార్థి దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థి దశలోనే భావిజీవితానికి అవసరమైన పరిజ్ఞానాన్ని, నైపుణ్యాలను సముపార్జించాలన్నారు. ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లి, క్రమ శిక్షణతో శ్రమిస్తే విజయం తప్పకుండా చేకూరుతుందన్నారు. కుగ్రామంగా ఉన్న మైసమ్మగూడ విద్యాసంస్థల ఏర్పాటుతో జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించగల్గింది అన్నారు. సాధారణ పాల వ్యాపారి అయిన తాను ఇంతటి విజయం సాధించగలిగితే ఇంజినీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులు ఎంతో చేయగలరని అన్నారు. విద్యార్థులు కేవలం ఉద్యోగంతో ఆగిపోవద్దని, ఆకాశమే హద్దుగా ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రామస్వామి రెడ్డి మాట్లాడుతూ నిజమైన జీవితం కళాశాల నుంచి కాలు బయట పెట్టినప్పుడే ప్రారంభం అవుతుందని, ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా వెరవకుండా ముందుకుసాగాలన్నారు. గౌరవ అతిథులుగా హాజరైన సర్వీస్ నౌ సంస్థ డైరెక్టర్ భాస్కర్ గంధవాడి, ఫాక్ట్ సెట్ ఉపాధ్యక్షురాలు అనుపమ రంజన్ మాట్లాడుతూ ప్రపంచ సాఫ్ట్‌వేర్ రంగంలో 70 శాతం ఉద్యోగాలు దేశంలో ఉండటం వల్ల ఆర్థిక మాంద్యం ప్రభావం దేశంపై తక్కువగా ఉంటుందన్నారు. తల్లిదండ్రుల కలల సాకారం చేయడానికి విద్యార్థులు శ్రమించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సాక్ సమన్వయకర్తలు సరజినీ, బాలాజీ కృష్ణ, సంధ్య, డీన్ డాక్టర్ ఉద య్ భాస్కర్, శివప్రసాద్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## భగాయత్‌లో సమస్యలపై జడ్సీకి వినతి

జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న ప్రతినిధులు

**రామంతాపూర్,జూలై 13:** ఉప్పల్ భగాయత్‌లోని హెచ్ఎండీఏ లేవుట్‌లో పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం అసోసియేషన్ కన్వీనర్ మేకల మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్‌కేశవ్ పటేల్ వినతి పత్రం సమర్పించారు. లేవుట్‌లో పారిశుధ్య అధ్వానంగా ఉందని, వీధిదీపాలు,డ్రైనేజీ వ్యవస్థ, గుంతలు పడినా రోడ్లతో ప్రజలు అవస్థలు పడుతున్నారని కమిషనర్ దృష్టికి తెచ్చారు లేవుట్ పేరుతో ఇంటి నంబర్లు వచ్చేలాచర్యలు తీసుకోవాలన్నారు. వీలైనంత త్వరలో చర్యలు తీసుకుంటానని కమిషనర్ హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు శ్రీనివాస్‌రావు,అంజిరెడ్డి, సుధాకర్,నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# రోడ్లపై మురుగు..పరుగు

- డ్రైనేజీ లైన్ ఏర్పాటు చేయకుండా రోడ్డు ఎలా వేస్తారు..?
- కార్పొరేటర్‌కుకాలనీవాసుల వినతి

పద్మశాలి సంఘం భవనం ముందు రోడ్డుపై చేరిన మురుగునీరు

డ్రైనేజీ లేక పోవడంతో మార్కండేయ ఆయలంలో చేరిన వర్షపు నీరు.

**రామంతాపూర్,జూలై 13:** రామంతాపూర్ ఇందిరానగర్‌లో కొన్ని ఏండ్లుగా తాము అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మురుగునీరు రోడ్లపై పారుతూ తాము ఇబ్బందులు పడుతున్నామని, డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయకుండా అధికారులు, కార్పొరేటర్ సీసీ రోడ్డు ఏర్పాటు చేయడం ఏమిటని గంగమ్మ అమ్మవారి ఆలయ అధ్యక్షులు పూస సత్తయ్య, రామంతాపూర్ పద్మశాలి సంఘం అధ్యక్షులు చిక్కా సత్యనారాయణ తోపాటు కాలనీ వాసులు వందలాది మంది ముక్తకంఠంతో అధికారులను, పాలకులను ప్రశ్నిస్తున్నారు.సదరు సమస్యను పరిష్కరించాలని కాలనీ వాసులు వందలాది మంది కార్పొరేటర్‌కు శనివారం వినతి పత్రం ఇచ్చారు. పొంగుతున్న మురుగునీరుతో తాము తీవ్రంగా అవస్థలు పడుతున్నామన్నారు. హెచ్‌పీ గ్యాస్ ఆఫీసు నుంచి పద్మశాలి సంఘం భవన్‌కు వరకు వర్షాకాలం వచ్చిందటే తమ బాధలు వర్ణనాతీతమన్నారు. సమస్య ఉధృతంగా ఉన్నా పట్టించుకోకపోవడం ఏమిటన్నారు. అండర్ గ్రౌండ్ కోసం కాలనీలో కొంత మేరకు డ్రైనేజీ పైపులు వేసి వదిలేసి,ఇప్పుడు సీసీ రోడ్డు వేస్తామని పాలకులు ప్రయత్నం చేయడం పట్ల కాలనీ వాసులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ విషయంలో అటు అధికారులకు, ఇటు పాలకులకు వినతి పత్రాలు ఇచ్చినా చర్యలు తీసుకోక పోవడం దారుణమని వారు ప్రశ్నించారు. పూర్తిస్థాయి డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసి రోడ్డు వేయాలని అధికారులకు, కార్పొరేటర్‌కు స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయం పై వాటర్ వర్క్స్ మేనేజర్‌ను వివరణ కొరగా ఇప్పటి వరకు డ్రైనేజీ లైన్ వేశామని స్థానిక ప్రజలు విజ్ఞప్తి మేరకు నిధులు మంజూరు అయితే మరింత డ్రైనేజీ లైన్ ఏర్పాటు చేస్తామని మేనేజర్ రవీందర్ గౌడ్ తెలిపారు.

## పద్మశాలి టౌన్‌షిప్‌లో సమస్యలు పరిష్కరించండి

**ఎమ్మెల్యేను కలిసి సమస్యలు విన్నవించిన పద్మాశాలి టౌన్‌షిప్ నూతన కమిటీ**

ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న పద్మశాలి టౌన్‌షిప్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు

**కాప్రా, జులై 13:** ఏఎస్‌రావునగర్ డివిజన్ పద్మశాలి టౌన్‌షిప్‌లో సమస్యలు పరిష్కరించాలని ఇటీవల బ్యాలెట్ పత్రాల ద్వారా ఎన్నికైన శ్రీభావనారుషి వెల్ఫేర్ అసోసియేషన్ నూతన ప్రతినిధులు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని ఏఎస్‌రావునగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలో పారిశుధ్య సమస్యలు పరిష్కరించడంతో పాటు, వీధిదీపాలు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. కొత్తకమిటీని అభినందించిన ఎమ్మెల్యే, పద్మశాలి టౌన్‌షిప్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్తరామారావు, డివిజన్ మాజీ అధ్యక్షులు కాసం మహిపాల్‌రెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శి కుమార స్వామి, టౌన్షిప్ అధ్యక్షులు ఎం.నరేంద్రరెడ్డి, గౌరవ అధ్యక్షులు కళ్లెం రాము, ప్రధాన కార్యదర్శి సుగుణేశ్వర్, కోశాధికారి సదానందం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### యువతకు తోడ్పాటు అందిస్తాం..

**ఉప్పల్:** యువతకు తగిన తోడ్పాటు అందించి, అభ్యున్నతి సాధించడానికి తనవంతు సహకారం అందజేస్తామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. చిలుకానగర్‌లో కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్‌తో కలిసి చాయస్ షాపును శనివారం ప్రారంభించారు.

## అయోధ్య రాముడి శివ ధనస్సు దర్శనం

**మల్కాజిగిరి, జూలై 13:** అల్వాల్‌లోని బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అయోధ్య రామునికి సమర్పించడానికి మణికొండకు చెందిన చల్లా శ్రీనివాస శాస్త్రి రూ.84లక్షలతో తయారు చేయించిన శివ ధనస్సును భక్తుల దర్శనం కోసం ఉంచారు.

## ఆలయానికి హుండీ బహూకరణ

**కీసర:**శ్రీ ప్రసన్నంజనేయస్వామి ఆలయానికి శనివారం హుండీని ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డి బహూకరించారు. శనివారం వేదపండితులు, ఆలయ అర్చకులు మహానంద శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి హుండీని ప్రారంభించారు.

## ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

**ఉప్పల్, జూలై 13:** ఉప్పల్, రామంతాపూర్ ప్రాంతాల్లో ఉప్పల్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ట్రాఫిక్ నిబంధనలు, డ్రగ్స్ నివారణ చర్యలపై శనివారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈమేరకు ఉప్పల్ ట్రాఫిక్ సీఐ లక్ష్మీ మాధవి హాజరై అవగాహన కల్పించారు. డ్రగ్స్‌ను అరికట్టేవిధంగా ప్రజలు తగిన తోడ్పాటు అందించాలని కోరారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, అనుమానం వచ్చిన వ్యక్తుల కదలికలను పోలీసులకు తెలియజేయాలన్నారు. డ్రగ్స్, గంజాయి రవాణకు వాహనాలు ఉపయోగిస్తారని, వీటిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ సూర్యానాయక్, ఎస్సై మహిపాల్‌రెడ్డి, ఉదయ్‌భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ లక్ష్మీమాధవి

## ఆకట్టుకున్న చేనేత వస్త్ర, హస్తకళా ప్రదర్శన

చేనేత వస్త్రాల ప్రదర్శనలో ఆధునాతన చీరలను పరిశీలిస్తున్న మహిళలు

**కాప్రా, జులై 13:** ఏఎస్‌రావునగర్ మైదానంలో ఏర్పాటు చేసిన కళాసిల్క్ చేనేత వస్త్రాలు, హస్తకళావస్తువుల ప్రదర్శన సందర్శకులను అమితంగా ఆకట్టుకుంటున్నది. చేనేత కళాకారులను, హస్తకళాకారులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో రక,రకాలైన చేనేత వస్త్రాలు, విభిన్నమైన హస్తకళా వస్తువులతో ఏఎస్‌రావునగర్‌లో చేనేత వస్త్రాలు, కళాకృతుల ప్రదర్శనను ఏర్పాటు చేసినట్టు కళా సిల్క్ సొసైటీ ప్రతినిధి వికాస్ జైన్ తెలిపారు. తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే పోచంపల్లి చీరలు, వెస్ట్ బెంగాల్ జాంధాన్ని చీరలు, రాజస్థానీ కోటా శారీస్, మంగళగిరి,ఉప్పాడ, చీరాల , వెంకటగిరి, ధర్మవరం చీరలతో పాటు రక రకాల బెడ్‌షీట్స్, కలంకారి, చేనేత వస్త్ర డ్రెస్ మెటీరియల్, లక్నో చికెన్ వర్క్ కర్తీస్, తిరోక్క్ వస్త్రాలు, యువత మెచ్చే విధంగా విభిన్న మైన వస్త్రాలు, వన్ గ్రామ్ గోల్డ్ ఆభరణాలు ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉంచామని వికాస్ తెలిపారు. ఈ ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు నిర్వహిస్తున్నామని, చేనేత వస్త్రాభిమానులు, హస్తకళాభిమానులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## ప్రతి ఇంటి వరకు రోడ్డు సౌకర్యం

17వ వార్డులో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న చైర్మన్ కొండల్‌రెడ్డి

**ఘట్‌కేసర్,జూలై13:** పోచారం మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి ఇంటి వరకు రోడ్డు సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు చైర్మన్ బి.కొండల్‌రెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డు సురేందర్‌రెడ్డి నగర్ వీకర్ సెక్షన్ కాలనీలో మున్సిపాలిటీ నిధులు రూ.10లక్షలతో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను శనివారం ఆయన పరిశీలించారు.అంతకు ముందు అన్నోజిగూడలోని మీరాంల చెరువు కుంటలో పేరుకుపోయిన గుర్రపు డెక్కను ఇన్ఫోసెస్ ప్రతినిధుల సహకారంతో తొలగించే కార్యక్రమాన్ని చైర్మన్ కొండల్‌రెడ్డి పరిశీలించారు.కార్యక్రమంలో కమిషనర్ వేమనరెడ్డి,వైస్ చైర్మన్ రెడ్యా నాయక్,కౌన్సిలర్లు,బీఆర్ఎస్‌నాయకులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్‌లో ప్రాజెక్టు ఎక్స్‌పో

**మేడ్చల్, జులై 13:** గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయలోని సీఎంఆర్ సెట్‌లో శనివారం బీటూబీ(బడ్ టూ బిజినెస్) పేరుతో ప్రాజెక్ట్ ఎక్స్‌పో నిర్వహించారు. కళాశాలకు చెందిన 300 జట్లు సామాజిక ఆవిష్కరణల ప్రదర్శనలు ఇచ్చారు. అందులో 89 ఉత్తమమైన ప్రదర్శనలను ఎంపిక చేశారు. వాటిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకు ఎంపికైన జట్లకు కళాశాల చైర్మన్ గోపాల్‌రెడ్డి, సీఈవో అభినవ్ రెడ్డి, ప్రిన్సిపాల్ వీఏ నారాయణ నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ దేవదాస్, సీఈఈఆర్ హెడ్ సురేశ్ రాం, వివిధ శాఖల హెచ్‌వోడీలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రశంసా పత్రాలు, బహుమతుల అందుకున్న విద్యార్థులతో అధ్యాపకులు

## శిల్పారామంలో స్వర నృత్య విభావరి

**ఉప్పల్, జూలై 13:** వారంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శనివారం స్వర నృత్య విభావరి నిర్వహించారు. ఈ కార్యక్రమం సందర్శకులను ఎంతో ఆకట్టుకుంది. ఈ మేరకు త్రిశతి, శ్రీనిధి,అనన్య,మయూఖ,స్నేహ, ప్రణతి, హృతిక , సంజన, వైష్ణవి సంగీత ఆలపన చేశారు. అనంతరం తాండవ నృత్యకారి, మూషికవాహన, తక్కువేమి మనకు జతిస్వరం, చేరి యశోదకు, తదితర అంశాలను ప్రదర్శించారు.

కళాకారుల ప్రదర్శన

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**మల్లాపూర్, జూలై 13 :** విషజ్వరాలు ప్రబలకుండా దోమల నివారణకు ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలని కార్పొరేటర్ జె. ప్రభుదాస్ సూచించారు. శనివారం మీర్‌పేట్ హెచ్‌బీకాలనీ డివిజన్ పరిధిలోని మధర్ థెరిసా పాఠశాలలో విద్యార్థులకు విషజ్వరాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైయ్యారు.కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శైలజ, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు, నాయకులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ జె. ప్రభుదాస్

## డివిజన్‌ను అభివృద్ధిలో ముందుకుతీసుకెళ్తా..

**రామంతాపూర్,జూలై 13 :** రామంతాపూర్ డివిజన్‌లోని భరత్‌నగర్‌లో రూ.75 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను శనివారం స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్ రావు అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం డివిజన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధిలో ముందుకు తీసుకుపోతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ శ్వేత,వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేందర్ పాల్గొన్నారు.

భరత్‌నగర్‌లో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి

## ఆదినారాయణకు నివాళి

పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

**నేరేడ్‌మెట్, జూలై 13:** అమీర్‌పేట డివిజన్ మాజీ కార్పొరేటర్ రాఘవన్ తండ్రి ఆదినారాయణ శనివారం గౌతంనగర్‌లోని ఆయన నివాసంలో గుండెపోటుతో మృతి చెందారు. ఆదినారాయణ పార్థివదేహానికి వివిధ పార్టీలకు చెందిన నాయకులు అభిమానులతో పాటు మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకుడు రాము యాదవ్, ఉపేందర్‌రెడ్డి ఆదినారాయణ పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

## నేడు ఎల్లమ్మ కల్యాణం

**కేపీహెచ్‌బీ కాలనీ, జూలై 13 :** కేపీహెచ్‌బీ కాలనీ 7వ ఫేజ్ సమీపంలోని కైత్లాపూర్ రేణుక ఎల్లమ్మతల్లి ఆలయ 4వ వార్షికోత్సవం, ఆషాఢ బోనాల నేపథ్యంలో ఎల్లమ్మ తల్లి కల్యాణం నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ వ్యవస్థాపక చైర్మన్ కొలుముల సంతోష్ తెలిపారు. భక్తుల కోసం అన్నసమారాధన ఉంటుందన్నారు. వేడుకలకు ముఖ్య అతిథులుగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్లు హాజరుకానున్నట్లు తెలిపారు.

## సంక్షేమ ఫలాలు అర్హులకు అందించాలి

**కేపీహెచ్‌బీకాలనీ, జూలై 13 :** ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు అందించాలని ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం ప్రభుత్వ సలహాదారుడిని కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శేరి సతీశ్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు కలిసి.. స్థానికుల సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా వేం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పనిచేస్తుందన్నారు.

## మైక్రోస్మాల్ ఇండస్ట్రీస్ అసోసియేషన్ కార్యవర్గం నియామకం

### కేకేబీ సంస్థ రద్దు చేస్తూ కీలక నిర్ణయం

**బాలానగర్, జూలై 13 :** బాలానగర్ మైక్రోస్మాల్ ఇండస్ట్రీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం నియామకమైంది. శనివారం బాలానగర్ శోభనకాలనీలోని అసోసియేషన్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తీర్మాణం చేసినట్లు వారు పేర్కొన్నారు. అధ్యక్షుడుగా అంబటి సునిల్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా టీ వెంకటేశ్వర్‌రెడ్డి, కోశాధికారిగా అలెక్స్, సలహాదారులుగా డి. చంద్రశేఖర్, ఎన్‌వీ రత్నం, విష్ణువర్ధన్‌రెడ్డి, లోహిత్‌రెడ్డి, తోట శివాజీ, బీ శ్రీనివాస్, సత్యనారాయణ, ఉపాధ్యలుగా డి. ప్రభాకర్, బీవీవీ బాలాజీ, బి. భాస్కర్‌రావు, ఎం శ్రీనివాసరాజు, సంయుక్త కార్యదర్శులుగా కె. అమరేశ్వర్‌రావు, ఆర్. సూర్యం, ఖాజా, ఎస్‌కే చాంద్ పాషాలతో పాటు ఆరుగురు కార్యనిర్వాహక కార్యదర్శులు, ఏడుగురు సభ్యులు ఉన్నారు.ఈ సందర్భంగా అధ్యక్షకార్యదర్శులు మాట్లాడుతూ.. అసోసియేషన్ సభ్యుల పారిశ్రామికాభివృద్ధి కోసం గత ప్రభుత్వాన్ని స్థలం కేటాయించాలని కోరగా..స్థలం కేటాయించిన విషయం సభ్యులందరికీ తెలిసిందే అన్నారు. స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్‌పీవీ) ద్వారా కేకేబీ అనే సంస్థను ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం పరిశ్రమల అభివృద్ధి పాలసీలో సమూల మార్పునకు శ్రీకారం చుట్టి ప్రభుత్వమే అభివృద్ధి చేస్తుందని వెల్లడించారని తెలిపారు.ఈ నేపథ్యంలో కేకేబీ సంస్థ ప్రస్తుతం అవసరం లేనందున రద్దు చేస్తున్నట్లు కమిటీ సభ్యులంతా సమాలోచనలు జరిపి నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

**దుండిగల్, జూలై 13 :** గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన శనివారం సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరా రం పీఎస్ పరిధిలోని సాయిపూజ థియేటర్ ఎదురుగా ఉన్న హేవెన్ 18 రెస్టారెంట్ గేటు పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉందని స్థానికుల నుంచి పోలీసులకు సమాచారం అందింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుడి వివరాలు సేకరించే ప్రయత్నం చేయగా..ఆధారాలు లభించలేదు. దీంతో గుర్తుతెలియని మృతదేహంగా కేసు నమోదు చేసిన గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి వయస్సు 35-40 ఏండ్ల మధ్యన ఉంటుందని, ఒంటిపై నీలిరంగు చెక్స్‌షర్ట్ ఉందని, వివరాలు తెలిస్తే సూరా రం పీఎస్‌లో గాని, 99080 76799కు గాని తెలియజేయాలని కోరార